క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తనిఖీ

సంతృప్తి వ్యక్తం చేసిన ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యులు జి.దేవి



నారాకోడూరు(చేబ్రోలు): ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ మెంబరు జి.దేవి బృందం చేబ్రోలు మండలం నారాకోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీ చేసింది. అలాగే పాఠశాలలో జరుగుతున్న మనబడి, నాడు - నేడు అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రికార్డులు, స్టాక్ తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఏజెన్సీ నిర్వాహకులు ముత్తేశ్వరమ్మను భోజనం తయారీపై ప్రశ్నించారు. హాజరైన విద్యార్థులందరూ భోజనం చేయటంతో ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలను అభినందించారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. తెనాలి, గుంటూరు ఉప విద్యాశాఖ అధికారులు నిర్మల, వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు పాల్గొన్నారు.

విజ్ఞాన్ వర్సిటీ విద్యార్థినికి పీహెచ్‌డీ



వెన్నం స్వాతి

చేబ్రోలు: స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థిని వెన్నం స్వాతికి తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. 'యాన్ ఎక్స్‌పెరిమెంటల్ ఇన్వెస్టిగేషన్ ఆన్ పర్ఫార్మెన్స్ ఆఫ్ హై-వాల్యూం ఫ్లైయాష్ విత్ హైబ్రిడ్ ఫైబర్ బేస్డ్ కాంక్రీట్' అనే అంశంపై ఆమె పరిశోధన చేసిందని తెలిపారు. ఆమె తన పరిశోధనలో భాగంగా మొత్తం 4 స్కోపస్ పేపర్లు పబ్లిష్ చేశారని వీసీ తెలిపారు. డాక్టరేట్ పొందిన వెన్నం స్వాతిని పలువురు అభినందించారు.

ఎస్‌ఐ కుటుంబానికి నగదు చెక్కు అందజేత



నగరంపాలెం: జిల్లా పోలీస్ కంట్రోల్ రూంలో ఎస్‌ఐగా విధులు నిర్వహించిన వి.వెంకట్రావు అనారోగ్యంతో ఈ ఏడాది ఫిబ్రవరి 16న మరణించారు. ఈ మేరకు వెంకట్రావు భార్య శ్రీదేవికి లక్ష రూపాయల కార్పస్ ఫండ్ చెక్కుని బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), కె.కోటేశ్వరావు (ఏఆర్) పాల్గొన్నారు.

కార్మికురాలికి ఆర్థిక సాయం

నగరంపాలెం: కోకోకోలా ఫ్యాక్టరీలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికురాలు పి.రత్నకుమారి గత నెల 29న గాయపడింది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం కుదుటపడింది. మానవతా దృక్పథంతో డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (గుంటూరు) శివకుమార్‌రెడ్డి స్పందించి, ఆర్థిక సాయం అందించారు. ఆయన స్ఫూర్తితో మంగళగిరి ఫైర్ అధికారి వెంకటేశ్వర్లు, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఫ్యాక్టరీలోని ఉద్యోగులు అందరూ కలసి రూ.30 వేలు సహాయం చేశారు. కార్మికులంతా తోటి వారికి సాయం చేయాలని, ప్రమాదాలు వాటిల్లకుండా యాజమాన్యం జాగ్రత్తలు తీసుకోవాలని శివకుమార్‌రెడ్డి తెలిపారు.

అభివృద్ధికి అడ్డుపడుతున్న ధూళిపాళ్ల

చేబ్రోలు: అభివృద్ధికి అడ్డుపడుతూ, ప్రజలను మభ్యపెట్టి, మోసగిస్తూ, దుష్ప్రచారాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పొన్నూరు అభివృద్ధిపై శ్రీరంగ నీతులు చెప్పటం హాస్యాస్పదంగా ఉందని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. 25 సంవత్సరాలు ఎమ్మెల్యేగా పనిచేసిన ధూళిపాళ్ల, రోడ్డు విస్తరణకు, మద్రాస్ కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానని, పనులు మొదలు పెట్టే లోపే ఎన్నికలు వచ్చాయి అని పదేపదే చెప్పుకోవడానికి సిగ్గు అనిపించడం లేదా అని నిలదీశారు. నియోజకవర్గంలో భారీస్థాయిలో అభివృద్ధి పనులు ఒక్కటైనా చేయగలిగావా అని ప్రశ్నించారు. అక్రమంగా రైతులకు చెందిన సంగం డెయిరీని సొంతం చేసుకొని, దాని మీద లాభాలు గడిస్తూ వేల కోట్లు రూపాయలు సంపాదించి ఎన్నికల్లో డబ్బు వెదజల్లి ధూళిపాళ్ల గెలుస్తున్నారని ఆరోపించారు. జీబీసీ రోడ్డు విస్తరణకు కృషి చేస్తుంటే, ఆటోనగర్ ఏర్పాటు చేస్తుంటే కోర్టుకు వెళ్లి అడుగడుగునా అడ్డుకుంటున్నాడని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ధూళిపాళ్ల అభివృద్ధి చేయడు, చేసే వాళ్ల చూస్తే ఓర్వ లేడని రోశయ్య ఎద్దేవా చేశారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా.. పొన్నూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో త్వరలోనే ఆటో నగర్ ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య స్పష్టం చేశారు. ఏఎంసీ చైర్మన్ ఎ.వెంకటేశ్వరావు, ఎంపీపీ భవనం పద్మలీల, బొద్దులూరి రంగారావు పాల్గొన్నారు.

ఇస్రో విజయంపై హర్షాతిరేకాలు



చంద్రయాన్-3 ల్యాండింగ్ దృశ్యాలను చూపిస్తున్న ఉపాధ్యాయులు



విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపైకి చేరడంతో వీవీఐటీ విద్యార్థుల ఆనందం

కాకుమాను: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం సాయంత్రం చంద్రయాన్-3 ప్రయోగ ల్యాండింగ్ దృశ్యాలను టీవీ ద్వారా చూపించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సత్యం మాట్లాడుతూ శాస్త్రవేత్తల కృషిని కొనియాడారు. ల్యాండింగ్ దృశ్యాలను ప్రజలు, విద్యార్థులు తిలకించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం లైవ్‌లో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థుల హర్షం

పెదకాకాని: చంద్రయాన్ -3 చందమామపై ల్యాండింగ్ దృశ్యాలను నంబూరు వీవీఐటీలో పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేసి, ప్రదర్శించారు. విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై మెల్లగా చేరుకోవడంతో విద్యార్థులు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందించారు.



నంబూరు వివా వీవీఐటీలో ప్రయోగాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

ఇస్రో శాస్త్రవేత్తలకు ఎమ్మెల్యే సుచరిత అభినందనలు

గుంటూరు రూరల్: చంద్రయాన్- 3 ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత బుధవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండ్ లాండ్ చేయడం భారతీయులు మరిచిపోలేని మహత్తర ఘటన అన్నారు. ఖగోళ చరిత్రలో భారత్ విజయం సువర్ణ అక్షరాలతో లిఖించబడుతుందన్నారు.

పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- మాచవరంలో గడప గడపకు మన ప్రభుత్వం
- రూ.23 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



మాచవరంలో సంక్షేమ లబ్ధిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

మాచవరం(చేబ్రోలు): పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు మండలం మాచవరం గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం సంక్షేమ లబ్ధిని తెలియజేసి, బుక్‌లెట్‌ను అందజేశారు. ప్రజల నుంచి వచ్చిన కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మాచవరంలో జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమన్నారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా బీసీ కాలనీలో రూ.23లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే రోశయ్య శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిక్కిలి సునీత, ఎంపీటీసీ తలతోటి ఏసు మరియమ్మ, మిక్కిలి ఏబు, బాబురావు, వినోద్, రఘు, మోపర్తి ప్రమీల, ఎంపీపీ భవనం పద్మలీల, ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు, పెరికల కృష్ణ మోహన్, ఎంపీడీవో శ్రీనివాసరావు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల మనిషి ప్రకాశం పంతులు



ప్రకాశం పంతులు జీవిత చరిత్రను వివరిస్తున్న ఉపాధ్యాయులు



టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పించిన శాస్త్రవేత్తలు



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించిన డాక్టర్ ప్రశాంతి

కాకుమాను: దేశ ప్రజల మన్ననలు పొందిన ప్రజా మనిషి టంగుటూరి ప్రకాశం పంతులు అని ఎంఈవో కెఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బ్రిటీష్ సైన్యాన్ని లెక్కచేయకుండా వారి తుపాకులకు ఎదురు నిలచిన ధైర్యశాలి టంగుటూరు ప్రకాశం పంతులు అని కొనియాడారు. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటాలు చేసి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ముఖ్యమంత్రిగా కృష్ణాబ్యారేజ్ నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత చరిత్రపై వ్యాసరచనపోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లాంఫాంలో ప్రకాశం పంతులు జయంతి

గుంటూరు రూరల్: ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులని లాం ఫాం వ్యవసాయ పరిశోధన స్థానం సంచాలకుడు డాక్టర్ జి.ప్రసాదరావు అన్నారు. బుధవారం లాంఫాంలో ప్రకాశం పంతులు 152వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఏడీఆర్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవిత చరిత్ర, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పాత్రను వివరించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రఘునాథరెడ్డి, సిబ్బంది, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు టంగుటూరి ప్రకాశం పంతులు

గుంటూరు రూరల్: స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి అన్నారు. బుధవారం లాంఫాం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా 2000 మంది ఖైదీలకు క్షమాభిక్ష, తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం స్థాపన, సేద్యపు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, సంయుక్త రిజిస్ట్రార్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కామ్రేడ్ మంచాల మృతికి సీపీఐ సంతాపం



పెదకాకాని: భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ కామ్రేడ్ మంచాల సాంబశివరావు మృతి బాధాకరమని గుంటూరు జిల్లా సీపీఐ కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ అన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంచాల సాంబశివరావు(68) మృతి చెందారు. ఆయన మృతదేహానికి పార్టీ జెండా కప్పి, పూలమాలవేసి నివాళులర్పించారు. పెదకాకాని లూథర్‌గిరి కాలనీకి చెందిన మంచాల సాంబశివరావు హేమలత స్పిన్నింగ్ మిల్లు నందు పనిచేస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారన్నారని తెలిపారు. పార్టీ అభ్యున్నతికి పాటుపడ్డారని కొనియాడారు. వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, సీపీఐ గ్రామ కార్యదర్శి పార్టీ బండ్ల డేవిడ్‌రాజు, కేతినేని అగస్టీన్, రామిశెట్టి శ్రీనివాసరావు, బుల్లా బాబురావు, నారా ప్రసాద్, గోపీ సుబ్బారావు పాల్గొని నివాళులర్పించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు ఈస్ట్: షాపుల్లో చోరీ కేసుల్లో నిందితుడ్ని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల అరండల్‌పేట పరిధిలోని రెండు షాపుల్లో చోరీ జరిగింది. విచారణ చేపట్టిన పోలీసులు బుధవారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన దుద్దాడ లింగంను అరెస్టు చేసి రూ. 9వేలు స్వాధీనం చేసుకున్నారు.

గృహ నిర్మాణాలపై దృష్టి సారించండి

మండల స్పెషల్ ఆఫీసర్, డీపీఓ ఆర్. కేశవరెడ్డి



మాట్లాడుతున్న డీపీఓ ఆర్ కేశవరెడ్డి, పక్కన ఎంపీడీవో శ్రీరమ్య

ప్రత్తిపాడు: గృహ నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించాలని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారి ఆర్. కేశవరెడ్డి అన్నారు. ప్రత్తిపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గృహ నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయాల వారీగా పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీపీవో కేశవరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికీ గృహ నిర్మాణం మొదలు పెట్టని లబ్ధిదారులకు సవివరంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆప్షన్-3కి మండలంలో కూడా అవకాశం ఉందన్నారు. మొదటిగా నడింపాలెం, ప్రత్తిపాడు, యనమదల గ్రామాల్లోని లబ్ధిదారులు ఆప్షన్-3 ఎంచుకోవచ్చని తెలిపారు. వారికి కాంట్రాక్టర్ ద్వారా ప్రభుత్వమే పూర్తిగా ఇంటిని నిర్మించి ఇస్తుందని తెలిపారు. లబ్ధిదారులతో మరోసారి సమావేశమై వారికి ఇంటి నిర్మాణం వల్ల కలిగే ప్రయోనాలను వివరించాలని ఆదేశించారు. గ్రామాల వారీగా లేఅవుట్లలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎ. శ్రీరమ్య, హౌసింగ్ ఏఈ సాగర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూను సందర్శించిన విజ్ఞాన్ వైస్ చాన్సలర్



తాడేపల్లిరూరల్: కేఎల్ యూనివర్సిటీని విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ నాగభూషణ్ బుధవారం సందర్శించారు. యూనివర్శిటీలో మూడు రోజుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ కార్యశాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగభూషణ్ మాట్లాడుతూ 2050 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 150 కోట్ల మందికి మెదడుకు సంబంధించిన వ్యాధులు సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మెదడు సమస్యలను త్వరితగతిన గుర్తించడానికి అధునాతన టెక్నాలజీ అవసరమని అన్నారు. కేఎల్‌యు ఆధ్వర్యంలో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ ప్రోత్సాహంతో జరుగుతున్న అంతర్జాతీయ కార్యశాల ఎంతో ఉపయుక్తమని అన్నారు. అనంతరం డాక్టర్ నాగభూషణ్‌ను కేఎల్‌యు ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాధరావు, పరిశోధనలు, అభివృద్ధి డీన్ డాక్టర్ జయకుమార్ సింగ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.శ్రీనివాసులు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్, కార్యక్రమ ముఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ ఎం.వసుజాదేవి, కో ఆర్డినేటర్లు ఆచార్యులు శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మి, సౌమ్య, శోభారాణి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

ఎంఈవో సీహెచ్ రమాదేవి



మాట్లాడుతున్న ఎంఈవో సీహెచ్ రమాదేవి, ఎంఈవో-2 లీలారాణి

ప్రత్తిపాడు: విద్యార్థుల్లో పోటీతత్వం ఎంతో అవసరమని ఎంఈవో సీహెచ్ రమాదేవి అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10 తరగతుల విద్యార్థులకు మంగళవారం పాఠశాల స్థాయిలో పోటీలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పోటీలను జరిపారు. తెలుగు భాష మాధుర్యంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రత్తిపాడు అక్షయ విద్యాలం విద్యార్థిని కె. లిఖిత, వ్యవహార భాష అమలు కోసం గిడుగు రామ్మూర్తి పంతులు చేసి ఉద్యమంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో గొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్. సాయిలక్ష్మి, తెలుగు పద్యాల పోటీల్లో యనమదల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పి. కెజియా, జానపద పాటల గేయాల పోటీలో గొట్టిపాడు హైస్కూల్ విద్యార్థిని ఆర్. యామినిప్రియ విజేతలుగా నిలిచారు. విజేతలకు ఎంఈవో రమాదేవి బహుమతులు ప్రదానం చేశారు. వీరంతా ఈ నెల 24న గుంటూరులో జరగనున్న జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తెలుగు భాషపై మమకారాన్ని పెంచుకోవాలన్నారు. కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో-2 లీలారాణి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

26న చలో ధర్నా చౌక్

మంగళగిరి: ముస్లిం హక్కుల పరిరక్షణకై నవరంగ్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన తలపెట్టిన చలో ధర్నా చౌక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఎస్‌కే జలీల్ కోరారు. బుధవారం ఆయన కార్పొరేషన్ పరిధి పెదవడ్లపూడిలోని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న 70 వేల ఎకరాల వక్ఫ్ భూములను నిరుపేద ముస్లింలకు, ఇళ్లు లేని ముస్లింలకు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

108 అఖండాలతో గ్రామోత్సవం

- వైభవంగా ప్రారంభమైన వీరభద్రుని శ్రీ చక్రస్థాపన మహోత్సవాలు



వీరభద్రుని ఎదుట శ్రీచక్రానికి జరుగుతున్న పూజలు



అఖండాలతో మహిళలు..

యనమదల (ప్రత్తిపాడు): వీరభద్రుని శ్రీచక్ర స్థాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని యనమదలలో కొలువుదీరిన భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయం చక్రస్థాపన మహోత్సవాల్లో భాగంగా తొలిరోజు బుధవారం ఉదయం గోపూజ, విఘ్నేశ్వర పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు వాసుశర్మ వేదపండితుల వేద మంత్రోచ్చరణల నడుమ స్వామి వారికి, అమ్మవారికి విశేష పూజలు జరిపారు. రాత్రి 108 అఖండాలతో శ్రీ చక్ర సహిత గ్రామోత్సవాన్ని గ్రామస్తులు, మహిళల సహకరంతో నేత్రపర్వంగా జరిపంచారు. అనంతరం యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, జలాధివాసం, క్షీరాధివాసం శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని, వీరభద్రుని దర్శించుకున్నారు.

ప్రత్తిపాడులో కుమ్మేసిన వాన

- లో లెవల్ చప్టాపై ఉప్పొంగిన నక్కల వాగు
- నిలిచిన వాహన రాకపోకలు



జలయమయమైన పాత పోస్టాఫీసు రోడ్డు



లోలెవల్ చప్టాపై ఉప్పొంగుతున్న నక్కల వాగు



జలయమయమైన ప్రత్తిపాడులోని లోతట్టు ప్రాంతాల్లోని అంతర్గత వీధి



నీటమునిగిన ప్రత్తిపాడు బస్టాండు ఆవరణ

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో వాన కుమ్మేసింది. బుధవారం సాయంత్రం ఉన్నట్లుండి ఆకాశం మేఘావృతమై కారుమబ్బులు కమ్మేశాయి. భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం దాదాపుగా మండలంలో గంటకు పైగా కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రత్తిపాడు-గొట్టిపాడు మార్గంలోని లోలెవల్ చప్టాపై నక్కల వాగు ఉప్పొంగడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ప్రత్తిపాడు నుంచి పెదగొట్టిపాడు మీదుగా పల్నాడు జిల్లా ఉన్నవ, బోయపాలెం, యడ్లపాడు, చిలకలూరిపేటలకు రాకపోకలు స్తంభించాయి. సుమారు మూడు గంటలకు పైగా వాహన చోదకులు వాగు ఉధృతి తగ్గే వరకు నిరీక్షించాల్సి వచ్చింది.